"కథానిక"

# ఆపదలో మనస్తత్వాలు

"పుష్య"

వసంతరావు, రామయ్యశాస్త్రి అన్నదమ్ములయినప్పటికీ, యిద్దరికీ ఏ విషయంలోనూ పోలిక కనుపించదు. మనస్తత్వాలలో లేకపోతే పోయింది, రూపంలోనైనా పోలికుండేమోనని చూసినా, ఏమాత్రం కనుపించదు. వీళ్ళిద్దరూ ఒక తల్లి బిడ్డలా అన్న సందేహంకూడా కలుగుతుంది, వాళ్ల కుటుంబం గురించి తెలిసినవాళ్ళకు తప్ప. వసంతరావు చాల పొడగరి. నలుపు ఛాయ. బొద్దుమీసం. గొప్ప శాస్త్రజ్ఞుడని పేరుపడ్డాడు ఆ చుట్టుపట్ల. అతని కళ్ళల్లోని కాంతిని చూడగానే ఇతడొక గొప్ప తార్కికుడన్న విషయం స్ఫురించక మానదు. ఇక రామయ్యశాస్త్రి మాట అంటారా, అన్నగారికన్న కొంచెం పొట్టి అయినా చాలా నీటైన మనిషి. పొడుగాటి వుంగరాల జుత్తు. మతం మీద ఆయనకున్న అభిమానం, ఇంకెవరికీ లేదనే చెప్పాలి. నిరంతరమూ దైవచింతే. అతడొక గొప్ప నిష్ఠాగరిష్ఠుడని, అతని నిర్మల నయనాల ప్రశాంతతే చెబుతుంది.

వసంతరావుకు రామయ్యశాస్త్రి పట్టి మూఢనమ్మకాల మనిషిలా కనిపిస్తాడు. ప్రపంచంలో నాస్తికుడెవడేనా ఉన్నాడా అంటే, వాడు వసంతరావు తప్ప యింకొకడు అయివుండడని రామయ్యశాస్త్రి నమ్మకం. చిన్నప్పటినుంచీ విసుగు, విరామం లేకుండా కృషిచేసి, వసంతం రసాయన శాస్త్రంలో 'నిధి' అనిపించుకున్నాడు. తమ్ముడి ఫక్కీ అంతా వేరని మొదటే చెప్పానుగా. అంచాత శాస్త్రం. ఓ ఛాందసుడైన సంస్కృత పండితునిదగ్గర శుశ్రూష చేసి, సంస్కృతభాషనంతటినీ ఆమూలాగ్రంగా పెల్లగించి యిటునుంచి అటుకడేశాడు. ఉంటున్నది ఒకే మేడయినా యిద్దరూ వేరువేరు ప్రపంచాలలో విహరిస్తూవుంటారు. ఒకప్రక్క వసంతరావు పాశ్చాత్య ఫక్కీలో కాలం గడుపుతూ వుంటే, రెండోప్రక్క పరిపూర్ణ ఛాందసంగా వుంటున్నాడు రామయ్యశాస్త్రి. వసంతానికి, బట్లర్ కాక్ వంట చేస్తాడు, మద్య మాంసాలతో. ఆయనమాత్రం యెప్పుడూ ఏ రిలెటివ్ సిద్ధాంత పుస్తకాలలోనో బుఱ్ఱదూర్చి కూర్చుంటాడు ఏదో చదువుతూ. మనశాస్త్రికి, ఈవేషం చూస్తే ఒళ్ళు భగ్గున మండుతుంది. తనుమాత్రం స్వయంగా వంటచేసుకొని నిరంతర 'గీతా' పారాయణలో తన్మయత్వం పొందుతూ వుంటాడు.

ఆచార వ్యవహారములలోనూ, మనః ప్రవృత్తులలోనూ ఇద్దరికీ తీరని భేదం వున్నప్పటికీ, ఒకరినొకరు తిట్టుకోవడం కానీ, అసహ్యించుకోవడం కానీ లేదు. ఎంతో అనురాగంతో వుంటారు.

దీనికి కారణం బహుశ, యిద్దరూ స్వేచ్ఛాజీవులయి వుండటమే అయివుంటుంది. ఇద్దరూ బాగా చదువుకున్నారు. తండ్రి సంపాయించి యిచ్చిన ఆస్తి బోలెడంత వుంది. తాము వుంటున్న యిల్లు కూడా స్వంతమే. వసంతానికి భార్యలేదు. రామయ్యశాస్త్రి మాట అంటే, అసలు పెళ్లే చేసుకోలేదు. ఆడవాళ్లు చపలచిత్తలు, దుర్బల మనస్కులు అని గ్రంథాలు ఘోషిస్తున్నాయి, అంతే కాకుండా యీ లోకంలో చిరకాలం పుట్టికట్టుకొని వుండిపోరనే విషయాన్ని, తన వదినగారు 'నిర్మల' మరణం దృఢపరిచింది. ఇంత తెలిసుండీ కూడా, పెళ్ళి చేసుకొని, యీ బాధలన్నీ పడమని ఎవడు చెప్పాడు, అని రామయ్యశాస్త్రి వాదన. ఇక యీ జన్మలో పెళ్ళి చేసుకోకూడదని ఏకంగా తీర్మానించేసుకున్నాడు. వసంతరావు కూడా తిరిగి పెళ్ళి చేసికొనే ప్రయత్నంలో వున్నట్టు ఎక్కడా కనుపించదు. అతని వుద్దేశమే వేరు. తాను కృషిచేస్తున్నది రిలెటివ్ సిద్ధాంతంలో

గదా. (Theory of Relativity) అంచాత తర్కించుకోవటం మొదలెట్టాడు.

'నిర్మల నిజంగా చనిపోయిందా? ఎక్కడా కనిపించదాయెను. అసలు ఉన్నట్టు కూడా అనిపించదే! అయినంత మాత్రాన నిర్మల లేదని ఎలా అనుకోవాలి? ఎందుకనుకోవాలి?,

ఇలా అన్నదమ్ములిద్దరూ, ఒకే యింటిలో విభిన్న మనస్తత్వాలతో కాలంపుచ్చుతున్నారు.

కాని ఒక్క విషయంలో మట్టుకు యిద్దరకూ సామ్యం వుంది. సూర్యారావంటే యిద్దరికీ పంచప్రాణాలు. పెద్దన్నగారైన విశ్వనాథం గారు పోయి చాలా కాలమయింది. ఆయన వెనకాలే భార్య కూడా పోయింది. ఇక వాళ్ళ కుటుంబానికి మిగిలినవాడు, ఆయన కొడుకు సూర్యం ఒక్కడే. తల్లిదండ్రులు లేనివాడు గదా అని వాడిని చూస్తే యిద్దరికీ అమితమైన ప్రేమ. సూర్యం తనలాగే గొప్ప సైన్టిస్టు కావాలని కోరేవాడు వసంతం. తనలాగే గొప్ప సంస్కృత భాషా కోవిదుడు కావాలని రామయ్యశాస్త్రి కోరేవాడు. ఇలా అనుకునేవారే కాని, పైకి మాత్రం అనలేక. సూర్యం దేనికీ అపేక్షించలేదు, తనింకా విద్యార్థిననే కామోసు.

అకస్మాత్తుగా ఒకనాడు సూర్యానికి జబ్బు చేసింది. అన్నదమ్ము లిద్దరూపడ్డ అవస్థ మరి చెప్పలేం. ఇల్లంతా మందులతోనూ, పళ్ళతోనూ నింపేశారు. ఎలోపతి డాక్టరు శేషయ్యను పిలుచుకొచ్చాడు వసంతం. శాస్త్రికి యిష్టంలేదు, ఇంగ్లీషు మందు యిప్పించడమంటే. అయినా, యిప్పు డెందుకని వూరుకున్నాడు, వారంరోజులవస్తోంది. ఏమీ గుణం కనుపించలేదు. రోజురోజుకూ జ్వరం హెచ్చయిపోతోంది. రామయ్యశాస్త్రి యిక వూరుకోలేక పోయాడు. ఆసాయంత్రం అన్నయ్యతో ఇలా అన్నాడు.

'అన్నయ్యా, జంధ్యాలశాస్త్రిగారిని తీసుకొస్తే బావుంటుంది. తెనుగు వైద్యంలో మా గట్టిచెయ్యి.'

'సరే, అలాగే కానియ్యి' అన్నాడు తన కిష్టంలేకపోయినా. తమ్ముడెక్కడ నొచ్చుకుంటాడో అని.

ఆ పూటనుంచీ జంధ్యాల శాస్త్రుల్లుగారి వైద్యప్రారంభం. ఇక ఫరవాలేదు. ఐదు ఘడియలలో జ్వరం కట్టేస్తుంది అన్న ధీమాతో కూర్చున్నాడు శాస్త్రి. రోజురోజూ మందు మార్చడమే కనిపిస్తోంది కాని, వారం రోజులవరకూ జ్వరం తగ్గే సూచనలేవీ కనుపించలేదు. రోగి మరింత మంచానికి బల్లిలా అంటుకుపోతున్నాడు. పేలాపన సంధికూడా ప్రారంభమయింది. శాస్త్రికి పూర్తిగా మతిపోయింది.

'అయ్యో, ఇన్నాళ్ళూ యీ చేతుల్తో పెంచానే. ఇప్పుడేమిటి నాకట్టికండికి యిలాంటి విఘాతం వచ్చిపడింది. అయ్యో దేవుడా!'

అని రోగికి బదులు తనే కలవరింత మొదలెట్టాడు. మనస్సు మనస్సులో లేదు. ఆలోచనొకటి తట్టింది.

'జ్యోతిష్కుడి సలహా అడిగితేనో? సూర్యం జాతకంకూడా నాదగ్గరే వుంది' అన్నాడు అన్నయ్యతో.

'నీ యిష్టం. అడగాలనివుంటే వెళ్లి అడుగు' అన్నాడు విసుగుతో వసంతరావు, యిదెక్కడి పిచ్చినమ్మకాలు దాపురించాయ్రా అని అనుకొని. మళ్ళా-'కాని. యీ జ్వరం యింకా నెల రోజులదాకా విడవదు. డాక్టరు స్పష్టంగా చెప్పేశాడు, యిది టైఫాయిడ్ అని.'

'నిజంగా?'

మీద వాణీ వేసుకొని. శాస్త్రి గబగబా, జ్యోతిష్కుడి దగ్గరకెళ్ళి అడిగాడు, సూర్యం త్వరగా తేరుకునే సూచన లేమైనా వున్నాయా అని. ఆయన జాతకం, యిటూ అటూ చూసి, గ్రహాల మహాదశలు, అంతర్దశలు, విదశలు కట్టి చెప్పాడు.

'ఇది కుజదోషం వల్ల వచ్చింది. దీనికి గ్రహశాంతి బాగా చెయ్యాలి.'

అని కావలసిన వస్తువులన్నీ వ్రాసియిచ్చేడు. శాస్త్రి ఒక రాగిరేకును రోగికి కట్టి, మిగతా శాంతికి వుపక్రమించాడు.

ఎన్ని చేసినా ఆ మాయదారి జ్వరం తగ్గలేదు. ఎడతెరిపి లేకుండా, అధికమైపోతోంది.

'తెనుగువైద్యుడు, తెనుగు వైద్యుడని కలవరించావు. ఏంగుణం కనిపించింది గనక. ఇవాసైనా ఆ డాక్టరు శేషయ్యగారిని పిలుద్దామా.' అన్నాడు వసంతరావు చిన్న కోపంతో.

'అయితే నీ యిష్టం.'

డాక్టరుగారిని తీసుకురావటానికి వెళ్ళాడు వసంతరావు. రోగికన్నా ఆవేదన హెచ్చుగా వుంది రామయ్యశాస్త్రికి. ఎన్నడూ అనుభవించ లేదు యిటువంటి వ్యథ. పెళ్ళీ పెడాకులూ, పిల్లాపీచు లేని తనకే యింత ఆరాటంగా వుంటే ఆ తల్లిదండ్రులు బ్రతికివుంటే యింకెంత బాధ పడివుండేవారో. ఐస్ బాగ్‌లో మరికొంచం ఐస్ వేసి సూర్యం తలమీద పెట్టేడు. ఆయాసం అధికంగా వుంది. మళ్ళా ఆలోచన.

'అందుకే అన్నారు పెద్దలు, జీవితమే దుఃఖ మయమని. జబ్బులూ, బాధలూ, ఒకటేమిటి, ఎన్నివుండాలో అన్నీని మన ఋషులు వెర్రి వాళ్ళయి పోయారా, అడవుల్లోకి. లేక పోతే ఆకూ, అలమూ తిని కడుపు మాడ్చుకోవటం వాళ్ళకు సంతోషమూ. ఏమిటో విచిత్ర ప్రపంచం.'

సూర్యం పలవరిస్తున్నాడు.

'అమ్మా! నన్నుకూడా నీదగ్గరికి రానియ్యవే.'

'నాన్నా! ఎక్కడున్నావు నాన్నా? నన్నెత్తుకోవూ' రామయ్యశాస్త్రిమీద భయం వణుకూ, ఒక్కసారి విరుచుకు పడ్డాయి. ఈ సమయంలో ఏంచేస్తే బావుంటుంది. అన్నయ్య యింటికి రాగానే అన్నాడు అతనితో—

'తారకేశ్వరాలయానికి వెళ్తున్నాను నేను. తిరిగి రెండురోజుల్లో వస్తాను. పిల్లాడు జాగ్రత్త సుమీ!'

'ఎందుకూ?'

'రెండురోజులు వుపవాసంవుండి ప్రార్థిస్తాను. ఆ ప్రభువుకికాని దయ కలిగిందా అంటే సూర్యం బ్రతికిపోయాడన్న మాటే.

తారకేశ్వరుడు సత్యమైన దేవుడని వినికిడి. పెద్దపెద్ద జబ్బులేమైనా వస్తే అక్కడకొచ్చి మొక్కుకుంటారు. ఒకప్పుడు కొన్ని వింతలు కూడా జరిగేయని ఆ చుట్టుప్రక్కల చెప్పుకుంటారు. డాక్టరుగారు రావడానికి యింకా ఆలస్యం వుంది. ఆయన వచ్చేదాకా ఆగ లేదు శాస్త్రి. ఆలయానికి బయలుదేరాడు.

ఈమధ్య తన వైద్యం మానిపించేశారు గదా అన్న కోపంతో శేషయ్య కొంచం టెక్కు చేసాడు. ఆలస్యంగా వచ్చి, రోగం విషమించిందని యింకా చూడకముందే చెప్పాడు. ప్రాణం ఎలాగైనా కాపాడమని వసంతరావు అతని కాళ్ళా వేళ్ళా పడవలసొచ్చింది.

రెండు దినాలు దొర్లిపోయాయి. శాస్త్రి తిరిగి యింటికొచ్చాడు చేతిలో మట్టి పిడత. దానినిండా నీరు. ఎందుకో మనిషి చాలా వుల్లాసంగా వున్నాడు.

'ఒరే అన్నా! నాకో విచిత్రమైన కలొచ్చిందిరా. తారకేశ్వరస్వామి కలలో కనిపించి, అన్నాడూ: ఆ యింగ్లీషు డాక్టరుచాత మందేమీ యిప్పించకండి. నా విగ్రహాన్ని కడిగిన నీరు పానవట్టంలోకి వస్తుంది కదా! అది తీసి కెళ్ళి రోగి నోట్లో పోస్తేరా, చటుక్కున జబ్బు నిమ్మదిస్తుంది అన్నాడు రా. నిజంగూడారా అది. అదృష్టం అంటే అలాగుండాలి' ఇతని మాటల ధోరణి చూసి డాక్టరు మండిపడ్డాడు.

'టైఫాయిడ్ జ్వరంలో బాధపడుతున్న రోగికి యీ పట్టు నీరు పోస్తే యింకేమైనా వుందా' అని రుసరుస మన్నాడు. అసలే మూఢ నమ్మకాలంటే రుద్రరూపం దాల్చుతాడు వసంత రావు. అందులో యీ మాట వినగానే యింకే ముంది. శాస్త్రి అప్పటికినట్టుకు వూరుకున్నాడు.

వాళ్ళిద్దరూ లేని సమయం చూసి, రోగిచేత త్రాగించేశాడు నీటిని. శాస్త్రి మనస్సుకు కష్ట పెట్టడం డాక్టరుగారికి యిష్టంలేదు. అంచాత తానసలు రోగికి యింజెక్షనే యివ్వనని శాస్త్రితో చెప్పి, రోజూ, అతను యింట్లోలేని సమయం కనిపెట్టి రోగికి యింజెక్షను ఇచ్చేస్తూ వుండేవాడు.

ఇలా ఒకళ్ళకు తెలియకుండా రెండోవాళ్ళు తమపనిని చేస్తూవచ్చారు. రోగంకూడా రోజుకు రోజు ముదురుతూవచ్చింది.

అర్ధరాత్రి సమయం. జబ్బు ఎక్కువై పోయింది. ప్రేలాపన సంధికూడా తీవ్రంగానే వుంది. వెంటనే వసంతరావు శాస్త్రిని లేపి, 'శాస్త్రీ! డాక్టరుకు ఫోనుచెయ్యి. సూర్యానికి వూపిరందడంలేదు. వేగం రమ్మను. వెళ్ళు!' అన్నాడు.

మేడక్రిందకెళ్ళి వణుకుతున్న చేత్తో ఫోనెత్తి పిలిచాడు శాస్త్రి.

'హల్లో! ... డాక్టర్ శేషగారేనా? ...

'నేనూ, రామయ్యశాస్త్రిని, మా సూర్యానికి ఊపిరందటం లేదండీ. వేగం వస్తారా? మీ పుణ్యముంటుంది. అన్నట్టు మీరొచ్చేటప్పుడు, ఇంజెక్షనులు కూడా పట్టుకురండి... అవునవును, చాలా సీరియస్‌గా వుంది. ఇంజెక్షనులు మర్చిపోకండీ.'

వసంతరావుకు రామయ్యశాస్త్రి కన్నా మతిపోయింది. ఏం చేయటానికీ తోచలేదు. ఒక ఆలోచన తట్టింది. క్రిందకెళ్ళిన శాస్త్రి యింకా రాలేదు. తొందరగా వెళ్ళి ఒకచేత్తో మట్టిపిడత పట్టుకొని, రెండోచేత్తో తమ్ముడు తెచ్చిన నీళ్ళు చెంచాడేసి పోస్తూ.

'నాయనా! సూర్యం నాబిడ్డ తండ్రివి కదూ. ఏదీ, యీ చెంచాడు నీళ్ళు తాగేయమ్మా. ఏదీ నోరువిప్పు' అని త్రాగించటానికి ప్రయత్నిస్తున్నాడు.

చెయ్యి వణుకుతోంది. సూర్యం గొంతుకలోకి నీళ్ళు ఒక చుక్కకూడా దిగలేదు. అదే అతని అంతిమక్షణం.

# అల్పత్వానికి అమరత్వమిచ్చే కిటుకు

వి. కె. మణి

బంధువు లెవరెవరో వచ్చి, పదిరోజులుండి ఈవాళ ప్రొద్దునే వెళ్ళిపోయారు. మధ్యాహ్నం ఏమీ తోచనట్టుగా ఉంది.- ఇదివరకింట్లో ఉన్నవీ, నిన్న మొన్న క్రొత్తగా వచ్చినవీ, పత్రికలు కొన్ని తీసి తిరగేస్తూ కూర్చున్నాను. ఏది తీసిచూసినా, మహానాయకులూ, మాటవరస నాయకులూ, మహిళామణులూ— మహోత్సాహంతో చేస్తున్న ఘనకార్యాలే- బొమ్మలతో సహా!

ఓహో! 'కెమెరా' తయారుచేసి ఫోటోలు తియ్యడం కనిపెట్టిన మహాపురుషుడు, చరిత్ర సత్యాన్ని శంకించడానికి సావకాశం లేకుండా చేసేశాడు. మహామహుల మహాత్కార్యాలని (సరైన సమయంలో) చటుక్కున మాటనొక్కి పట్టేసి తరతరాలకూ కొట్టొచ్చినట్టుగా కళ్ళ ఎదుట స్థిరంగా నిలిపేసేలాటి వీలు కలిగించేశాడు- చరిత్రకారులు- కాదు- రాజ్యాంగవేత్తలూ, పత్రికాధిపతులూ, ఈ ఋణం ఎన్నటికీ తీర్చుకోలేరు!

రామాయణ, భారతాదుల్ని నమ్మినవాళ్లున్నారు, నమ్మనివాళ్లున్నారు. 'అవన్నీ పుక్కిటి పురాణాలూ, బూటకాలూ కావు. దేశచరిత్రలే అవీని- ఆనాడూ ఎంతెంతో బలశాలు లున్నారు, ధీమంతులున్నారు. బాణకంకణం కట్టి అర్థులకు లేదనకుండా ఇచ్చిన వారున్నారు, చక్కదనమూ సామర్థ్యమూ గల సాకపాత్రులున్నారు.' అని నమ్మినవారంటే, 'ఆఁ అవన్నీ మహాకవుల ఊహాచిత్రాలు. ఆ తాటాకులలోన వ్రాసినదానికి తార్కాణమేముంది?' అని వెంటనే నమ్మనివారు త్రోసెయ్య వచ్చును. కాని, ఏదీ అప్పుడే గనుక కెమేరాలుండి, రావణాసురుడు పది తలలతో (ఆ సమయానికే అమర్చుకున్న అట్టతలలైనా సరే!) కైలాసగిరిని పార్వతీ పరమేశ్వరులతో సహా, ఎత్తుతున్నట్టూ, చేతగాని కోతిమూకను వెనక వేసుకుని, చిడిముడి పాటుతో, శ్రీరాముడు చెలరేగుతూన్న వారధి మదమణచడానికి శరము సంధించేసరికి బెదరి ప్రాణభీతితో భార్యా సహితంగా సముద్రుడు శరణార్థియై వస్తూన్నట్టూ, రామరాజ్యంలో ప్రతినిత్యమూ, ధర్మరాజు రాజ్యంలో అప్పుడప్పుడూ, (కనీసం రాజసూయ యాగసమయంలోనైనా) సంతర్పణలు జరుగుతున్నట్టూ, పంక్తులమధ్య నేతిజాడీ- పులుసు గోకర్ణం పట్టుకుని, ఆ రాజాధిరాజులు స్వయంగా వడ్డిస్తూన్నట్టూ, వస్త్రదానాలు చేస్తున్నట్టూ - తమ పైమీది ఖండువా కూడా! (మా చిన్నపాపకి కూడా నెలకోమాటు తనబట్టలన్నీ అందరికీ పంచి పెట్టెయ్యాలనుంటుందిట) హాయిగా కొత్తవి కొనుక్కో వచ్చని!) కర్ణుడు తన సౌధం పడగొట్టించి బ్రాహ్మణ యజ్ఞానికి సమిధ లిప్పిస్తున్నట్టు, రాతిగా ఉన్న అహల్య